ప్రభుత్వ స్థలానికి పంగనామం

- రోడ్డు మార్జిన్ ప్రభుత్వ స్థలానికి తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు
- ఈ స్థలంలో ఆక్రమణలను తొలగించిన నగరపాలక సంస్థ
- అయినా స్థలం ప్రైవేట్‌దని నమ్మబలికి విక్రయం
- స్థలాన్ని ఆనుకుని ఉన్న వినాయకుని గుడి కమిటీ కొనుగోలు
- వ్యవహారాన్ని నడిపిన మంత్రి కొల్లు కీలక అనుచరుడు



మూడు స్తంభాల సెంటర్ విజయ గణపతి గుడి పక్కన తవ్వకాలు జరిపిన రోడ్డు మార్జిన్ స్థలం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఇలాకాలో మరో అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. మంత్రి కొల్లుకు ప్రధాన అనుచరుడుగా ఉన్న ఓ నాయకుని కనుసన్నల్లోనే ఈ అక్రమ భూదందా జరిగింది. సాక్షాత్తు విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని సాక్షిగా పంగనామాలతో దర్శనమిచ్చే ఆ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని మధ్యవర్తిగా ఉండి అమ్మేశాడు. ఈ ప్రభుత్వ స్థల ఆక్రమణదారులకు ఈ వ్యవహారం తెలియకుండానే ఈ ప్రబుద్ధుడు అతని అనుచరుడు కలసి ఈ భూదందాను నడిపినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి...

నగరంలోని 41వ డివిజన్ పరిధిలో ఉన్న మూడు స్తంభాల సెంటర్లో రోడ్డు మార్గంలో విజయ గణపతి ఆలయం ఉంది. ఈ ఆలయం గోడ పక్కనే రోడ్డు మార్జిన్ స్థలంలో కొన్నేళ్లుగా మల్లంపల్లి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు నిర్మించి రోడ్డు వైపు బడ్డీ కొట్టు నిర్వహించారు. ఈ స్థలాన్ని పూర్వీకుల ఆస్తిగా చూపించి అతని కుమార్తె నాగేశ్వరమ్మకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. నాగేశ్వరమ్మ 2022లో మృతి చెందడంతో ఈ స్థలంపై మేనల్లుడు వాసు కన్ను పడింది. దీంతో ఆ టీడీపీ నాయకుడి అండదండలతో నాగేశ్వరమ్మ కుమారులకు కూడా విషయం చెప్పకుండా 2022లో విక్రయానికి పెట్టాడు. గుడివాడకు చెందిన గొల్లపల్లి అనురాధ అనే మహిళకు రూ.10 లక్షలకు ఈ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. అయితే ఈ స్థలంలో నాగేశ్వరమ్మ కుమారులే నివాసం ఉంటున్నారు. ఇటీవల నగర పాలక సంస్థ అధికారులు రోడ్డు మార్గంలోని ఆక్రమణలను తొలగించే సమయంలో ఈ స్థలంలో ఉన్న ఈ గృహాన్ని, బడ్డీని తొలగించారు. దీంతో నాగేశ్వరమ్మ కుమారులు వేరే ప్రాంతానికి వెళ్లి నివసిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఈ టీడీపీ నాయకుడు, వాసు ఈ స్థలాన్ని విజయ గణపతి ఆలయ కమిటీకి అమ్మకానికి పెట్టారు. ఇది ప్రభుత్వ స్థలం కదా.. అని కమిటీ సందేహం వ్యక్తం చేయగా, ఇది ప్రైవేటు స్థలమని రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని చూపి.. ఈ స్థలంలో ఉన్న గృహాన్ని తొలగించినందుకు గాను నగరపాలక సంస్థపై కోర్టుకు వెళ్లామని నమ్మబలికారు. దీంతో ఆలయ కమిటీ సుమారు 70 నుంచి 80 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని రూ.16 లక్షలకు కొనేందుకు నిర్ణయం చేసి రూ.నాలుగు లక్షలు అడ్వాన్సుగా చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ స్థల అమ్మకంలో ఈ టీడీపీ నాయకుడు కీలకంగా వ్యవహరించి స్థలానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని ఆలయ కమిటీకి అభయం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆలయ కమిటీ సోమవారం ఉదయం గుడిని ఆనుకుని ఉన్న ఈ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు జేసీబీతో తవ్వకాలు జరిపారు. ఈ వ్యవహారాన్ని నడిపిన టీడీపీ నాయకుని కుమారుడు ఇటీవల ఓ మేజర్ యువతిని ప్రేమించి పెళ్లాడుతానని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి చివరకు పెళ్లి చేసుకోకపోవడంతో జైలు పాలైన ఘటనను నగర ప్రజలు మరవక ముందే ఈ ప్రభుత్వ భూమి విక్రయ దందాలో ఆ నాయకుడు ఉండడం చర్చనీయాంశమైంది.

చర్యలు తీసుకుంటాం

నగరంలోని మూడు స్తంభాల సెంటర్లో విజయ గణపతి ఆలయం పక్కనున్న స్థలం రోడ్డు మార్జిన్ ప్రభుత్వ స్థలమే. అందుకే ఆ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించాం. రోడ్డు మార్జిన్ ఆ ప్రాంతంలో 20 అడుగుల మేర ఉంది. ఆ స్థలంలో తవ్వకాలు జరిగినట్లు నా దృష్టికి రాలేదు. ఈ స్థల క్రయవిక్రయాలు చట్టరీత్యా నేరం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– హరి ప్రసాద్, టీపీఓ

పెడన ఎంఈఓ-1గా సలోమి బాధ్యతల స్వీకారం



పెడన: పెడన మండల ఎంఈఓ-1గా మచిలీపట్నం రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.సలోమి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కాకినాడ జోన్-2 ఆర్‌జేడీ జి.నాగమణి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు మచిలీపట్నం ఎంఈఓ-1 ఎంవీఎస్ దుర్గాప్రసాద్ పెడన ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఎంఈఓ-1గా బాధ్యతలు తీసుకున్న సలోమిని ఎంఈఓ-2 వైవీ హరనాథ్, సిబ్బంది సత్కరించారు.

నాగాయలంక-1 నూతన ఎంఈఓ శ్రీకాంత్



నాగాయలంక: మండల నూతన విద్యాశాఖ అధికారి-1 గా సనకా శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై నాగాయలంక ఎంఈఓ-1 గా ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శ్రీకాంత్‌కు ప్రస్తుత ఎంఈఓ-1 టీవీఎం రామదాసు బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు, సీఆర్పీలు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జ్ఞాన సముపార్జనతో ఉన్నత శిఖరాలు



పెడన: విద్యార్థులు జ్ఞాన సముపార్జన ద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవాలని విజయవాడ రామకృష్ణ మిషన్ ప్రతినిధి బ్రహ్మచారి అమోహచైతన్య అన్నారు. మండల పరిధిలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు ఎవరికివారు ఆత్మన్యూనతా భావం విడనాడి కొత్త విషయాలు తెలుసుకోవడం ద్వారా జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. అప్పుడే విద్యార్థులు దేశాభివృద్ధిలో తమ వంతు చురుకైన పాత్రను పోషించగలుగుతారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ బీఆర్ఎస్ రెడ్డి, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఈడీ డి.బాబా, వైస్ ప్రిన్స్‌పాల్ డి.రాజా రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

ఏడీఏ శ్రీనివాస్

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): రైతులంతా తమ పంటను నమోదు చేయించుకోవాలని ఏడీఏ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని ఉత్తర చిరువోలులంక గ్రామంలో వరి పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ పద్ధతులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పంట నమోదు, కౌలు రైతులందరూ కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. వరి, పసుపు పంటకు ఇన్సూరెన్స్ చేయించుకునే గడువు ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు తెలపారు. అధిక మోతాదులలో ఎరువులు, పురుగుమందులు వాడకం సరికాదని, గ్రామంలో అధిక మోతాదులో వేసిన ఎంటీయు 1318 వరి వంగడం తక్కువ మోతాదులోనే యూరియాను స్వీకరిస్తుందని తెలియచేశారు. ఏఓ కె.హెప్సీబా రాణి, వీవీఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



కోడూరు: దివిసీమ గాంధీ, మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా సోమవారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు పర్యవేక్షణలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ దుప్పట్లను పేదలకు అందించారు. కోడూరు ప్రధాన సెంటర్‌లోని మండలి విగ్రహానికి వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన సమయంలో కృష్ణారావు చేసిన సేవలను కొనియాడారు. పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నేతలు మర్రే గంగయ్య, కోట రాంబాబు, అద్దంకి పాండురంగారావు, పూతబోయిన సీతారత్నసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గంగానమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

మేళమర్తిలంక(మోపిదేవి): మండలంలోని మేళమర్తిలంక గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీగంగానమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా సోమవారం నిర్వహించారు. యార్లగడ్డ వారి ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీగంగానమ్మ అమ్మవారిని నూతనంగా నిర్మించిన ఆలయంలో యార్లగడ్డ వంశీకులు, ఆలయ నిర్వాహకులు యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్(లంకబాబు), మాజీ సర్పంచ్ రమాదేవి దంపతులు, యార్లగడ్డ అరవింద్, అలివేణి దంపతులు సంప్రదాయబద్ధంగా అమ్మవారిని ఉదయం 8 గంటలకు పునఃప్రతిష్ఠింపచేశారు. అంతకముందు వేదపండితులు దీక్షాహోమాలు, గర్తన్యాసము, గోదర్శనము, పూర్ణాహుతి, ఆశీర్వచనము, మంగళహారతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ ప్రారంభించారు. విశ్రాంత డీఎస్పీ పోతరాజు, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ ఎ.వీర వెంకట సత్యనారాయణ, చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, చల్లపల్లి గ్రామసర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, అడపా గురవయ్య, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పైడమ్మ సంబరం

గూడూరు: కప్పలదొడ్డిలో శ్రీ పైడమ్మ తల్లి సంబరం సోమవారం ఘనంగా ముగిసింది. అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి హారతులు పట్టారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో దాదాపు 3వేల మంది తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు.

తల్లిపాలే బలవర్ధక ఆహారం

బంటుమిల్లి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి దగ్గర నుంచి ముర్రుపాలు పట్టడమే బలవర్ధకమైన ఆహారమని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎం.సముద్రవేణి అన్నారు. మండల పరిధిలోని మల్లంపూడి గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సముద్రవేణి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోడూరులో...

కోడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కోడూరులోని నాయుడుపేట, ముందడుగు, మెరకగౌడపాలెం, వీవర్స్‌కాలనీ, లింగారెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వారోత్సవాలను జరిపారు. తల్లి తన బిడ్డకు ఏడాది వరకు తల్లిపాలను తప్పని ఇవ్వాలని, దీంతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లి ముర్రిపాలు అమృతంతో సమానమని, తల్లిపాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు.

మల్లవోలులో...

గూడూరు: తల్లిపాలు తాగిన బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుతారని మల్లవోలు పీహెచ్‌సి వైద్యాధికారి వై.రూపాశ్రీ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూపాశ్రీ మాట్లాడుతూ తల్లిపాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, తద్వారా బిడ్డ ఎదుగుదలతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎ.తాతబ్బాయి, ఎంపీహెచ్ఎస్ జి.అనురాధ, స్టాఫ్‌నర్సు డి.విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి, అంగన్వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఇంతేరులో...

కృత్తివెన్ను: పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే అసలైన ఆరోగ్యం వస్తుందని వైద్యురాలు వి.జయశ్రీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ఇంతేరులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలనే ఇవ్వాలని, తరువాత రెండేళ్ల వరకు అనుబంధ పోషకాలతో పాటు తల్లిపాలను ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య సూచనలు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దేవరకోటలో...

దేవరకోట(ఘంటసాల): ముర్రిపాలతో చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ముర్రిపాలపై అవగాహన కల్పించి అప్పుడే పుట్టిన బిడ్డకు పట్టించేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లక్ష్యం



కోనేరుసెంటర్: మీకోసంలో అందిన అర్జీలను చట్ట పరిధిలో విచారించి సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను సానుకూలంగా ఆలకించారు. పరిష్కార చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇచ్చారు. కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు జారీ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులు ధైర్యంగా తమ సమస్యను అర్జీ రూపంలో మీకోసంలో సమర్పించవచ్చని తెలిపారు. సోమవారం జరిగిన మీకోసంలో 30 అర్జీలు అందినట్లు చెప్పారు.

కరుణశ్రీకి ఘన నివాళి

మచిలీపట్నంటౌన్: కరుణ రసంపై కవితలు రాసిన జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పలువురు వక్తలు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్టార్ స్కూల్లో జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపయ్య శాస్త్రి చిత్రపటానికి పలువురు మానవతావాదులు, సాహితీ ప్రియులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ మాట్లాడుతూ పాపయ్య శాస్త్రి రచించిన కరుణశ్రీ, విజయశ్రీ ఖండ కావ్యాలలోని పద్యాలను మృదుమధురంగా వినిపించారు. మానవత సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జి.కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముదిగొండ శాస్త్రి, మానవత సంస్థ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీరాం, మచిలీపట్నం శాఖ జాయింట్ సెక్రటరీ పీవీ ఫణికుమార్, ప్రిన్సిపాల్ గౌసియా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

కొండలమ్మ మృతదేహానికి నివాళి

కోడూరు: పిడుగుపాటుతో మృతిచెందిన ఇరాలి గ్రామానికి చెందిన గంజాల కొండలమ్మ మృతదేహానికి సోమవారం వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ కొండలమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి, మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు.

కొండలమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలి

వ్యవసాయ క్షేత్రంలో వరినాట్లు వేస్తుండగా పిడుగుపాటుతో మృతిచెందిన కొండలమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ నేతలు డిమాండ్ చేశారు. గతంలో ప్రకృతి విపత్తుల కారణంగా మృతిచెందిన కూలీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని సంఘ జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు తెలిపారు.

వ్యవసాయ రంగంలో ఏఐను వినియోగించుకోవాలి

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి



వరి, మినుము పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతుల శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

ఘంటసాల: వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సును రైతులు వినియోగించుకుని ముందుకు సాగాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వరి, మినుము పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతోందన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంబించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని తెలిపారు. కృత్రిమ మేధస్సును వినియోగించుకుని రైతులు ముందుకు నడవాలని, డ్రోన్‌తో మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. రిమోట్ సెన్సింగ్ వంటి నూతన విజ్ఞానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే సస్య పోషణ శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ వరిలో చేపట్టాల్సిన ఎరువులు, కలుపు యాజమాన్యంపై వివరించారు. కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త కె.రేవతి మాట్లాడుతూ వరిలో ఆశించే చీడపీడల యాజమాన్య పద్ధతుల గురించి, చేపట్టాల్సిన మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ గోస్వామి, సస్య రక్షణ అధికారి చౌదరి, మొవ్వ ఏడీఏ శ్యామల, సహాయ సస్యరక్షణ అధికారి ప్రేమ రంజిత, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు వేణు మృతికి సింహాద్రి నివాళి



పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన అశ్వారావుపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రేపల్లె సూర్యప్రకాష్ వేణుగోపాల కృష్ణమూర్తి అలియాస్ వేణు (68)కు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. అశ్వారావుపాలెంలోని ఆయన స్వగృహం వద్ద వేణు భౌతికకాయానికి సింహాద్రి రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కొద్ది దూరం పాడె మోశారు. వేణుకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చింతలపూడి బాలు, పార్టీ నాయకుడు గరికపాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాపవినాశనంలో ఫీవర్ సర్వే



పాపవినాశనంలో ఇంటింటా ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న డెప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు

పాపవినాశనం(ఘంటసాల): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్యాలు రాకుండా ఉంటాయని డెప్యూటీ ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పరిసరాల పరిశుభ్రత, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొట్టెలు, కుండల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, తాగునీరు కాచి చల్లార్చుకుని తాగాలని తెలియజేశారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేయించడంతో పాటు ఎబెట్ పిచికారీ చేయించి దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్ తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో ప్రజలకు కరపత్రాలు పంచి విష జ్వరాలు, డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు.

అథ్లెటిక్స్‌లో ఏపీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ



పలు పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బేతపూడి రవి, పీఈటీలు

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో విజయవాడ పీబీ సిద్ధార్థ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో నగరంలోని చిలకలపూడి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ బేతపూడి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ ఆదివారం జరిగిన వివిధ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు ప్రతిభను సాధించారన్నారు. ఈ పోటీల్లో విజేతలు ఈ నెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జావెలిన్ త్రో అండర్ 16 విభాగంలో అవినాష్ ప్రథమ స్థానాన్ని, కె.వినయ్ రెండో స్థానాన్ని, 110 మీటర్ల హర్డిల్స్ అండర్ 18లో బి.నరహరి రెండో స్థానం, అండర్ 16 విభాగంలో మూడు కిలోమీటర్ల నడక పోటీలో బి.మణికంఠ మొదటి స్థానం, షాట్‌పుట్ అండర్ 18లో ఎస్కే ఫజల్ మూడో స్థానం సాధించారని ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటేందుకు శిక్షణ ఇచ్చిన పీఈటీలు జి.వాసుదేవరావు, వి.వెంకటేశ్వరరావు, విజేతలైన విద్యార్థులను సోమవారం ప్రిన్సిపాల్ రవి అభినందించారు.

ఘనంగా మండలి శతజయంతి ఉత్సవాలు

అవనిగడ్డ: మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ఏపీ శాసనసభ డెప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు సోమవారం ప్రారంభించారు. స్థానిక గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి డెప్యూటీ స్పీకర్, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం, మెగా వైద్యశిబిరాలను రఘురామకృష్ణంరాజు, కొనకళ్ల ప్రారంభించారు. తొలుత వంతెన సెంటర్‌లోని వెంకట కృష్ణారావు విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో పాటు పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగాయలంకలో...

నాగాయలంక: మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కార్యక్రమం సోమవారం నాగాయలంక సాయిబాబాగుడి సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. మండలి విగ్రహానికి తొలుత డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పూలమాలలువేసి నివాళులర్పించారు. అదే వేదికపై ఉన్న మహాత్మాగాంధీ, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు కూడా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తలగడదీవి గ్రామంలో భోగాది బబ్జీ ఆధ్వర్యంలో సహకార భవనం ప్రాంగణంలోని వెంకటకృష్ణారావు విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో మొదలైన పవిత్రోత్సవ పూజలు

బంటుమిల్లి: స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి నుంచి భక్తిశ్రద్ధలతో మొదలయ్యాయి. పండితుడు పవన్‌కుమార్ శిష్య బృందం వేద మంత్రాల మధ్య విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, దీక్షాధారణ, అంకురారోపణ తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 9న జరగనున్న స్వామివారి శాంతికల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సబ్బిశెట్టి రాజ, కె.కరుణకుమార్, సీహెచ్ రాధాకృష్ణ, కె.రాంబాబు, జె.శరభయ్యగుప్త, కొల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లయన్స్ సేవలను విస్తృతం చేయాలి



చల్లపల్లి: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు సూచించారు. స్థానిక శారదా గ్రాండియర్‌లో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ చల్లపల్లి శాఖకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ముమ్మనేని రాజకుమార్(నాని), కార్యదర్శి వరదా హరిగోపాల్, కోశాధికారి నర్రా సాయిబాబు, ఇతర కార్యవర్గ సభ్యులతో లయన్స్ క్లబ్ ఎంజేఎఫ్ దామర్ల శ్రీశాంతి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు ముమ్మనేని రాజకుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్‌లు సీహెచ్ శ్రీనివాసరెడ్డి, కొత్రకూటి శ్యామ్‌కుమార్, పీఎంజేఎఫ్ డాక్టర్ ఎర్రంరెడ్డి గాంధీ, జోన్ చైర్‌పర్సన్ మోపిదేవి వెంకటేశ్వరరావు, ఆర్‌సీ కోఆర్డినేటర్ ఎన్‌సీహెచ్ రాజేశ్వరరావు, జీఎస్‌టీ ముత్యం ప్రసాద్, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

నేడు చల్లపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

చల్లపల్లి: రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం నిలుపుదల చేయాలని, విద్యుత్ చార్జీల నిలువుదోపిడీని ఆపాలని కోరుతూ స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఐక్య ప్రజా వేదిక నాయకుడు, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు కోరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని మద్దతుగా ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొనాలని మధు విజ్ఞప్తి చేశారు.